# ప్రజాజ్యోతి

నిజామాబాద్ కామారెడ్డి

మంగళవారం । 28 । అక్టోబరు । 2025 పేజీలు 4




## మనస్తాపంతో ఏఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్య

3



## మార్మోగిన గోవింద నామ స్మరణ

3

## పోలీస్ అమరులకు నివాళులు

3

## రాజగోపురానికి విరాళం

నిజామాబాదు రూరల్: అక్టోబర్, 27 (ప్రజా జ్యోతి)
నిజామాబాద్ రూరల్ సిరికొండ మండల కేంద్రానికి 7 కిలోమీటర్ల దూరంలో గల గట్టమైన అడవి కొండల లోయల మధ్యలో ఉన్న, స్వయంభు సాక్షాత్ లొంక రామలింగేశ్వర స్వామి మహా క్షేత్రం నందు, త్రీ తల రాజగోపురం నిర్మాణానికి సిరికొండ మండల కేంద్రానికి చెందిన, కర్క సుమలత అనిల్ తమ వంతు విరాళంగా ఒక వంద ఎనిమిది రాళ్లకు, పదివేల తొమ్మిది వందల ఎనిమిది రూపాయల నగదును, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు అందించారు. ఆలయ గోపుర నిర్మాణానికి విరాళంగా అందించిన కర్క అనిల్ వారి కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. స్వామి వారి ఆశీస్సులు వారి కుటుంబానికి ఎల్లవేళలా ఉండాలని వారు భగవంతుని వేడుకున్నారు.

## పైరవీలకు తావు లేకుండా కేసులను పరిష్కరించుకోండి

**పోలీస్ ప్రజావాణి కార్యక్రమంలో 11 ఫిర్యాదులు**

**పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య, ఐ.పి.ఎస్**



నిజామాబాద్ రూరల్: అక్టోబర్, 27 (ప్రజా జ్యోతి)
నిజామాబాదు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య, ఐ.పి.ఎస్. ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.
ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు పలు సూచనలు చేయడమైనది.ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 11 మంది ఫిర్యాదు దారుల నుండి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్ యొక్క ఎస్.ఐ, సి.ఐ లకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని, పరిష్కారానికి సూచనలు చేయడం జరిగింది. సిపి పి.సాయి చైతన్య మాట్లాడుతూ..ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ, వారి వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకొనేల, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని అన్నారు.

## జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలో సూపర్ బ్రెయిన్ యోగాపై కార్యశాల

### గుంజీళ్ళ అంతర్జాతీయ ప్రచారకులు అందె జీవన్ రావు మీడియాతో వెల్లడి

నిజామాబాద్ జిల్లా
జమ్మూ కాశ్మీర్ రాష్ట్రం అనంత నాగ్ జిల్లాలోని కొకర్ నాగ్ తహసిల్ హాన్ గుల్ గుండ్ గ్రామంలోని విద్యార్థులకు అంగన్వాడి కేంద్రంలో "సూపర్ బ్రెయిన్ యోగా" అనే అంశంపై గుంజీళ్ళ అంతర్జాతీయ ప్రచారకులు అందె జీవన్ రావు కార్యశాల నిర్వహించారు. ఈ కార్యశాలలో గుంజీళ్ళ మాస్టారు అందె జీవన్ రావు సూపర్ బ్రెయిన్ యోగా యొక్క ప్రాముఖ్యతను వివరించారు. అంతేకాకుండా యోగా ద్వారా మెదడును చురుకుదనం చేసే వ్యాయామంగా అంతర్జాతీయంగా సాధన చేస్తున్నారని తెలిపారు. మన దేశంలో పాఠశాలలో గుంజీళ్లను ఉతక్ బైఠక్ మరియు ముర్గా (పనిష్మెంట్) అనే పేర్లతో తీయించేవారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మన భారత ఉప ఖండానికి మాత్రమే పరిమితమైన గుంజీళ్లు సూపర్ బ్రెయిన్ యోగా అనే పేరుతో విశ్వవ్యాప్తమైందన్నారు. సూపర్ బ్రెయిన్ యోగా అనేది గుంజీళ్ళ మెరుగైన విధానమని, క్రమ పద్ధతిలో సూపర్ బ్రెయిన్ యోగా చేయడం ద్వారా జ్ఞాపకశక్తి పెరుగుతుందని తాజా పరిశోధనలు తెలియజేస్తున్నాయని ఆ పరిశోధన వివరాలను విద్యార్థులకు వివరించారు. సూపర్ బ్రెయిన్ యోగా చేయడం వలన జ్ఞాపక శక్తి, ఏకాగ్రత, మెరుగైన శ్రద్ధ, సమస్య పరిష్కారం, అభ్యసనం, గుర్తుంచుకోవడం, సృజనాత్మకత, మానసిక పెరుగుదల, మానసిక సమతుల్యత మొదలైనవి పెంపొంది సమస్యలు మరియు ఆందోళనల నుండి ఉపశమనం కలుగుతుందని వివరించారు. యోగా ప్రాముఖ్యత పెరుగుతున్న తరుణంలో సూపర్ బ్రెయిన్ యోగా వలన విద్యార్థులకు మేలు జరుగుతుందని అన్నారు. కావునా గుంజీళ్లు తీయడాన్ని "శిక్షగా కాకుండా శిక్షణ" గా పరిగణించాలని అన్నారు. బహుళ ప్రయోజనాలు ఉన్న సూపర్ బ్రెయిన్ యోగాను పాఠశాలలో శిక్షణలో భాగంగానే పరిగణించి అమలు చేయడం ద్వారా విద్యార్థి లోకం సమగ్రాభివృద్ధికి దోహద పడుతుందని అందె జీవన్ రావు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులచే 14 రౌండ్లు సూపర్ బ్రెయిన్ యోగా చేయించారు. డాక్టర్ రఫియా హసన్ అందె జీవన్ రావు వివరించిన అంశాలను కాశ్మీరీ భాషలో తర్జుమా చేసి విద్యార్థులకు తమదైన సులభ శైలిలో అరటిపండు ఒలచి పెట్టిన చందంగా వివరించారని అందె జీవన్ రావు పేర్కొన్నారు. విద్యార్థులు ఎంతో క్రమశిక్షణతో ఆసక్తిగా చూసి విని ఆనందించారు. తలపెట్టిన కార్యం ఆసాంతం విజయవంతమైంది. సర్వత్రా హర్షద్వానాలు మిన్ను ముట్టాయి.

## కానిస్టేబుల్ నుండి హెడ్ కానిస్టేబుల్ గా ప్రమోషన్

ప్రమోషన్ పొందిన పదిమందిని అభినందించిన సిపి

నిజామాబాద్ రూరల్: అక్టోబర్, 27 (ప్రజా జ్యోతి)
తెలంగాణ రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి ఆదేశానుసారంగా, నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పరిధిలోని పీసీ నుండి, హెచ్ సి లు గా ప్రమోషన్ పొందిన పదిమంది సోమవారం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ను కలిసి ధన్యవాదాలు తెలిపారు. గత కొంతకాలంగా ప్రమోషన్ గూర్చి




ఎదురుచూస్తున్నటువంటి కానిస్టేబుల్ లకు హెడ్ కానిస్టేబుల్ ప్రమోషన్ రావడంతో సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రమోషన్ పొందినటువంటి కానిస్టేబుల్ లకు పోలీస్ కమిషనర్ శుభాకాంక్షలు తెలియజేశారు. పదోన్నతి పొందిన వారిలో ఏ .లింబాద్రి రెంజల్ పిఎస్, కే .చిన్నయ్య కోటగిరి పిఎస్,పి. గణేష్ నిజామాబాద్ రూరల్ పిఎస్, కే .యాదవ్ మాక్లూర్ పిఎస్, ఏ .వరప్రసాద్ కమ్మర్పల్లి పిఎస్, ఎండి. ఆరిపుద్దీన్ నిజామాబాద్ టు టౌన్ పిఎస్, సిహెచ్. శేఖర్ పిసిఆర్ నుండి, డి. శ్రీనివాస్ రావు నవీపేట్ పిఎస్, జి. శ్రీనివాస్ భీమ్గల్ పిఎస్ నుండి, శ్రీ రామ్ చందర్ ఇంటలిజెన్స్ ఓడి నుండి. పదిమంది హెడ్ కానిస్టేబుల్ గా ప్రమోషన్ పొందిన కానిస్టేబుల్ లు వీరంతా జగిత్యాల జిల్లాకు వెళుతున్నారని నిజామాబాద్ సిపి. పి. సాయి చైతన్య పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు.

## కార్తీక మాసం మొదటి సోమవారం ఆలయంలో 33దీపాలు వెలిగించారు

నిజామాబాద్ రూరల్: అక్టోబర్, 27 (ప్రజా జ్యోతి)
కార్తీక మాసం సందర్భంగా నిజామాబాద్ రూరల్ సిరికొండ మండల కేంద్రంలో కార్తీక మాసం మొదటి సోమవారం శ్రీలొంక రామలింగేశ్వర స్వామి ఆలయంలో 33 దీపాలు వెలిగించారు. 33 దీపాలు వెలిగిస్తే 33 కోట్ల దేవతలకు వెలిగించినట్లు అవుతుందని మహిళలు తెలిపారు. దండాల నాగరాజ్ పంతులు ఆధ్వర్యంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# స్క్రాప్ యజమానుల పై కఠిన చర్యలు తీసుకోవాలి

ఇందల్ వాయి,( ప్రజా జ్యోతి న్యూస్) అక్టోబర్,27
ఇందల్వాయి మండలంలోని రైల్వే స్టేషన్ కు వెళ్లే సర్వీస్ రోడ్ లో స్క్రాప్ యజమాని ప్రతి రోజు పాత టైర్,లు సర్వీస్ వైరులు కాలుస్తూ కాపర్ వైర్ల కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్లాస్టిక్ వైర్ కాల్చే సమయంలో వచ్చే పొగాతో అనారోగ్యానికి గురవుతున్నామని ప్రజలు తెలిపారు.ఇప్పటికైనా కాపర్ వైర్లు,సర్వీస్ వైర్ కాల్చే వారిని సంబంధిత అధికారులు అదుపులో తీసుకొని. అట్టి పొగను నియంత్రించాలని ప్రజలు ఆందోళన వ్యక్తం చేన్నారు.ఇలాగే కొనసాగితే తమ ఆరోగ్యలను ఎలా కాపాడుకోవాలని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ద్విచక్ర వాహనాలు దొంగతనం అయినా వాహనాలు కూడా ఇక్కడ పెట్టి కట్ చేస్తూ పార్ట్ పార్ట్ గా విడదీసి ఎగుమతి చేస్తున్నారు, గత



ఎమ్మార్వో రమేష్ కు ఫిర్యాదు కూడా చేసేశారు సర్వీస్ రోడ్డుపై నిరంతరం పాత సామాన్లు ఇనుప ట్రాక్టర్ ఇక రా వాహనాల కు సంబంధించినవన్నీ గ్రైండర్లతో కట్ చేస్తూ సర్వీస్ రోడ్లో వెళ్తున్న వాహనాలకు కూడా టైర్ పంచర్ అయిన సందర్భాలు కూడా జరుగుతూ ఉన్నాయి. మండల అధికారి తక్షణమే స్క్రాప్ నిర్వహిస్తున్న యజమానులపై తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## నాపై ఆరోపణల్లో వాస్తవం లేదు

అనుమతుల తోనే ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం



ఇందలవాయి ( ప్రజా జ్యోతి న్యూస్) అక్టోబర్ 27 ఇందల్వాయి మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీ వాసులు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తిగత కక్ష్య లతోనే మానసికంగా మా కుటుంబాన్ని ఇబ్బందులు పెడుతున్నారని గౌరారం కారోబార్ రవి పేర్కొనారు. తన దగ్గరున్న ఆధారాలతో విలేకరుల సమావేశం ఆదివారం ఏర్పాటు లింగాపూర్ గ్రామం లో కొండ సవిత కు ఇందిరమ్మ ఇళ్లు మంజూరైంది. పనులు సైతం కొనసాగుతున్న యి. ఇందిరమ్మ ఇళ్లు పక్కనే మినీ వాటర్ ట్యాంక్ ను పంచాయితీ సిబ్బంది గతంలోనే నిర్మించారు. అదే గ్రామానికి చెందిన ఎస్సీ కులస్తులు కొండ సవిత కుటుంబానికి చెందిన కొండ రవి మినీ వాటర్ ట్యాంక్ ను కూల్చి వేస్తాడని చెప్పడం జరిగిందని దీంతో ఎస్సీ కాలనిలో తాగు నీటి సమస్య ఏర్పడుతుందని, అక్రమంగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసుకున్నాడని కొండ రవిపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన కొందరు హౌసింగ్ పీడీ , ఎంపీడీ ఓ అనంత రావు లిఖిత పూర్వకంగా శు క్రవారం పిర్యాదు చేశారు. దీంతో అధికారులు విచారణ చేపట్టి కొండ సవిత కు ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం కొరకుఅనుమతి ఇచ్చారు . కొండ రవి తనపై వస్తున్న ఆరోపణల్లో నిజం లేదని ఆదివారం లింగాపూర్ గ్రామం లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కొండ రవి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇల్లు పక్కనే ఉన్న మినీ వాటర్ ట్యాంక్ కూల్చివేస్తామని నేనెప్పుడు అన లేదని ట్యాంక్ లో నీళ్ళు నింపకుండా అడ్డు పడుతున్నామని చెప్పడం తప్పుడు ఆరోపణల్ని ఆయన ఖండించారు. మినీ వాటర్ ట్యాంక్ లో ఎలాంటి పనులు చేపట్టినా, మరమ్మత్తులు చేసిన నాకు, మా కుటుంబానికి ఎలాంటి అభ్యంతరం




లేదని ఆయన విలేకరుల ముందు పేర్కొన్నారు. గతం లో కొండ సవిత కు ఇందిరమ్మ ఇళ్లు మంజూరైందనీ తప్పుడు పిర్యాదులు ఇచ్చారని, గతం లో కొండ సవిత కు ప్రభుత్వ పరంగా ఎలాంటి ఇల్లు మంజూరు కాలేదని ఉన్నత అధికారులు చెప్పడం జరిగిందని , ఇందిరమ్మ ఇళ్లు కట్టుకోవచ్చని హౌసింగ్ అధికారులు ఉత్తర్వులు సైతం ఇచ్చారని మంజూరు పత్రాలను చూపించాడు. అన్ని అనుమతుల తోనే ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం చేపట్టామని గ్రామం లో కొందరు మా కుటుంబం పై కక్ష్య కట్టి ఇందిరమ్మ ఇల్లు నిర్మాణాన్ని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని వాపోయారు..కొండ సవిత ఒంటరి మహిళా అని ఆమెకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం కొనసాగేలా అధికారులు, పోలీసులు రక్షణ కల్పించాలని వేడుకున్నారు.

## ఇందిరమ్మ ఇళ్లకు అనుమతి ఇచ్చాం.. హౌసింగ్ పీడీ పవన్

కొండ సవితకు ఇందిరమ్మ ఇళ్లు కట్టుకోవడానికి అనుమతి ఇచ్చాం. ఇందిరమ్మ ఇల్లు ను రద్దు చేయాలని పిర్యాదులు వచ్చాయి. విచారణ చేపట్టాం . పిర్యాదులో వాస్తవం లేదు

## ప్రభుత్వ పాఠశాల నూతన భవనం ప్రారంభం

మాక్లూర్ అక్టోబర్ 27 (ప్రజా జ్యోతి ) మాక్లూర్ మండల కేంద్రంలో సోమవారం జడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్ పాఠశాలలకు సంబంధించి నూతన భవనాలను సోమవారం ప్రారంభించారు.



బారాస ఎన్ ఆర్ ఐ గ్లోబల్ కన్వీనర్ బిగాల మహేష్ గుప్త తండ్రి బిగాల కృష్ణమూర్తి, తాత బిగాల గంగారం జ్ఞాపకార్థం రూ. కోటి సొంత నిధులు, విద్యాశాఖ నిధులు రూ.5.70 కోట్లతో నిర్మించిన పాఠశాలలను ప్రారంభించారు. రాజ్యసభ సభ్యులు కేఆర్ సురేష్ రెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభోత్సవం చేశారు. కాగా.. ఈ భవనాలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనానికి బిగాల కృష్ణమూర్తి, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనానికి బిగాల గంగారం అని నామకరణం చేశారు. ఈ కార్యక్రమంలో అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగల గణేష్ గుప్తా, మాజీ జెడ్పీ చైర్మన్ దాదన్న గారి విట్టల్ రావు, జిల్లా మాజీ మేయర్, జిల్లా విద్యాశాఖ అధికారి, మండలాధికారులు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.



## పోలీస్ అమరులకు నివాళులు

బాల్కొండ ఆర్ సి ప్రజా జ్యోతి అక్టోబర్ 27 నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండలంలో పోలీస్ అమరవీరుల వారోత్సవాలలో భాగంగా జై జవాన్ జైహింద్ పోలీస్ అమరవీరులకు వందనాలు అంటూ నినాదాలు గుప్పించారు దేశ రక్షణలో ప్రాణాలు త్యాగం చేసిన పోలీస్ అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం వారి స్ఫూర్తితోనే సమాజ సేవలో ముందుకు సాగాలని బాల్కొండ సిఐ శ్రీధర్ రెడ్డి ఎస్సై శైలేందర్ పాల్గొని బాల్కొండ హై స్కూల్ గ్రౌండ్ నుండి సైకిల్ మరియు మోటార్ సైకిల్ ర్యాలీని ప్రారంభించి కిసాన్ నగర్ వరద కాలువ వరకు నిర్వహించారు ఈ కార్యక్రమంలో బాల్కొండ మండల ప్రజలు యువకులు పెద్దలు భారీ సంఖ్యలో హాజరయ్యి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

## సిరికొండ సొసైటీ పరిధిలో కొనుగోలు కేంద్రాలు వేగవంతం

నిజామాబాద్ రూరల్ సిరికొండ మండలంలో చురుకుగా కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు మూడు రోజులు భారీ వర్షాలు ఉన్నవని వాతావరణ శాఖ హెచ్చరించడంతో కొనుగోలు కేంద్రాలలో వేగం పెరిగింది. సిరికొండ సొసైటీ ఆధ్వర్యంలో హమాలీలు, లారీలు కొరవ లేకుండా చూసుకుంటున్నారు. వర్షాలు ఉన్నందున రైతులు ఎండిన ధాన్యంపై ప్లాస్టిక్ కవర్లు కప్పి ఉంచాలని సొసైటీ చైర్మన్ చెల్లెలం గంగాధర్, సిబ్బంది తెలిపారు. ప్రభుత్వం అనుమతించిన సెంటర్లో ధాన్యం విక్రయించుకోవాలని రైతులకు సూచించారు.కొండూరు గ్రామానికి చెందిన రైతు సల్ల చిన్న రాజారెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలోని కొండూరు గ్రామం వరి పంట అధికంగా వేస్తారు. ఈ వర్షాకాలం పంట దిగుబడి చాలా తక్కువగా ఉందని అన్నారు. ఎకరానికి రెండు ట్రాక్టర్ లు దిగుబడి వస్తుండేది. 40 కిలోల బస్తా 70 లేదా 75 సంచులు దిగుబడి వచ్చేది ఇప్పుడు 60 నుండి 65 బస్తాలు ధాన్యం వస్తుందని అన్నారు. వాతావరణ పరిస్థితుల వల్ల సమయానికి వర్షాలు లేక, పంటలు వేసిన తర్వాత వరి పువ్వు దశలో ఉండగా అత్యధికంగా వర్షాలు పడి రాలిపోవడంతో పంట దిగుబడి ఎకరానికి 10 నుండి 15 బస్తాలు తగ్గిందని ఆయన తెలిపారు. గత 20 సంవత్సరాల నుండి దొడ్డుబడ్లు వేసే వారిమి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుండి సన్న వార్లు పెడితే బోనస్ ఇస్తామని ప్రకటించడంతో సన్న వడ్లు పెడుతున్నాము దిగుబడి తక్కువ వస్తుందని అన్నారు. ప్రభుత్వం సన్నబడ్లకు బోనస్ త్వరగా వేయాలని లేదంటే రైతు నష్టపోయే ప్రమాదం ఉందని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## ప్రజావాణికి దరఖాస్తులు నిల్....

నాగిరెడ్డిపేట్,అక్టోబర్27(ప్రజాజ్యోతి): నాగిరెడ్డిపేట్ మండలంలోని తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. తహశీల్దార్ తో శ్రీనివాస్ రావుతో పాటు ఇతర అధికారులు వేచి చూసినప్పటికీ ప్రజల నుంచి స్పందన కనిపించలేదు. ఈ సందర్భంగా తహశీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ మండల ప్రజలు ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని,ఏమైనా సమస్యలుంటే ప్రజావాణిలో అర్జీలు అందజేయాలన్నారు.సమస్యల పరిష్కారం కోసం సత్వర చర్యలు తీసుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.



## మార్మోగిన గోవింద నామ స్మరణ

భీమ్ గల్ 27 ప్రజాజ్యోతి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన శ్రీమన్నింబాచల క్షేత్రం పై సోమవారం నుండి కార్తీక మాస బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభం అయ్యాయి. ఏడాది పాటు భీంగల్ పట్టణం లోని శ్రీ లక్ష్మీ నరసింహుని అతి పురాతనమైన గ్రామాలయం లో పూజలు అందుకున్న ఉత్సవ విగ్రహాలను కార్తీక మాస బ్రహ్మోత్సవాలకు కొండకు చేరుస్తారు. అందులో భాగంగా పట్టణం లోని గ్రామాలయం లో స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. ఉత్సవాల ప్రారంభం సందర్భంగా సాయంత్రం 3గంటలకు గ్రామాలయం నుండి ప్రత్యేకంగా అలంకరణ చేసిన పల్లకిలో శ్రీ లక్ష్మీ నరసింహుని ఉత్సవ విగ్రహాలను ఉంచారు. బోయలు పల్లకిని మోస్తుండగా, మేళతాళాలు, మంగళ హారతులు వెంట నడిచాయి. సుహాసినిలు నెత్తిన బోనాలు ధరించి భక్తి పారవశ్యంతో స్వామి పల్లకిని అనుసరించారు. గ్రామాలయం నుండి మొదలుకొని సందిగల్లీ మీదుగా పురానిపేట్ నుండి స్వామి వారి పల్లకిని తీసుకెళ్లారు. దారి పొడవునా పల్లకిలో కొలువైన శ్రీ లక్ష్మీ నరసింహులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గోవిందా నామ స్మరణతో దారులు మార్మోగాయి. రాత్రి కొండకు చేరుకున్న స్వామి వారికి శ్రీ కీర్తివర్ధనం ప్రమాణం అనుసరించి పూజలు చేయగా శ్రీమన్నారాయణుని పరమ అర్చవధార వైభవాన్ని చాటి చెప్పే పంచారాత్రగాన్ని అనుసరించి ఉత్సవాలు ప్రారంభించారు. కొండకేగిన శ్రీ లక్ష్మీ నరసింహుని కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు.

## మనస్తాపంతో ఏఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్య



రామారెడ్డి అక్టోబర్ 27 (ప్రజాజ్యోతి) భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపం చెందిన ఏఆర్ కానిస్టేబుల్ పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కామారెడ్డి పట్టణానికి కూతవేటు దూరంలో సోమవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. రామారెడ్డి మండల కేంద్రంలోని మద్దికుంట గ్రామానికి చెందిన రేకులపల్లి జీవన్ రెడ్డి (37) ఏఆర్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. అయితే జీవన్‌రెడ్డికి ముస్తాబాద్ మండలం మొరాయిపల్లి గ్రామానికి చెందిన చందనతో వివాహం జరిగింది. వీరికి మోక్ష, కృతిక ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. అయితే భార్యాభర్తల మధ్య గత రెండు మూడేళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. ఏడాది క్రితం చందన తన పుట్టింటికి వెళ్లిపోయింది.విడాకుల నోటీసులు రావడంతో అప్పటి నుంచి ఎన్నిసార్లు అడిగినా కాపురానికి రాలేదు. ఇటీవల విడాకుల నోటీసులు కూడా రావడంతో జీవన్ రెడ్డి తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం ఉదయం 7:30 ప్రాంతంలో డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి బైక్‌పై ఇంట్లో నుంచి బయలుదేరాడు.ఇంట్లో నుంచి వెళ్లిన జీవన్ రెడ్డి కామారెడ్డి మండలం గర్గుల్ శివారులోని అడ్లూర్ గోదాం వద్ద ఉన్న రాధస్వామి సత్సంగ బ్యాగ్ ఆశ్రమం వెనకాల మృతదేహమై కనిపించడంతో గొర్రెల కాపరి పోలీసులకు సమాచారం అందించాడు.దాంతో కామారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ చైతన్య రెడ్డి , రూరల్ సీఐ రామన్ ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కొద్దిసేపటి తర్వాత జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర అక్కడికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



## అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

నాగిరెడ్డిపేట్,అక్టోబర్27(ప్రజాజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను సోమవారం ఉదయం పట్టుకున్నట్లు ఎస్సై భార్గవ్ గౌడ్ తెలిపారు.ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం లింగంపేట్ మండలంలోని పర్మల్ల తండా గ్రామం నుంచి రెండు ట్రాక్టర్లు,శెట్పల్లి సంగారెడ్డి నుంచి ఒకటి,నాగిరెడ్డిపేట్ మండలంలోని పల్లె బొగుడ తండా గ్రామానికి చెందిన ఒక ట్రాక్టర్ ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు జప్తి జానకంపల్లి గ్రామ సమీపంలో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై భార్గవ్ గౌడ్ తెలిపారు.పర్మల్ల తండా గ్రామానికి చెందిన రామావత్ లింభ్య,రామావత్ రమేష్,రామావత్ పరమేష్ లు, కానిస్టేబుల్ సందీప్,గంగారంలపై దురుసుగా ప్రవర్తించి,విధులకు ఆటంకం కలిగించి,ట్రాక్టర్‌తో ఢీ కొట్టి చంపేస్తాము అని బెదిరించడంతో ఆ ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.




# వన్యప్రాణుల ఆవాసానికి అటవీ ప్రాంతం అనుకూలం

## – కామారెడ్డి డివిజనల్ అటవీ అధికారి రామకృష్ణ

నాగిరెడ్డిపేట్,అక్టోబర్27(ప్రజాజ్యోతి): కామారెడ్డి జిల్లాలో గల అటవీ ప్రాంతం చిరుతలు,ఎలుగుబంట్లు నివసించడానికి అనుకూల ప్రాంతమని కామారెడ్డి డివిజనల్ అటవీ అధికారి రామకృష్ణ తెలిపారు. నాగిరెడ్డిపేట రేంజ్ పరిధిలోగల లొంకలపల్లి గ్రామ శివారులో చిరుత పులి సంచరించిన ప్రాంతాలను సిబ్బందితో కలిసి సోమవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అటవీలో వన్యప్రాణులకు ఆహారం నీరు ఉన్నంతకాలం అటవీను విడిచి బయటకు రావు అని, వీటి కోసం సహజ సిద్ధంగా నీళ్లు ఉండేలా అటవీ ప్రాంతంలో గుంతలను,చెక్ డ్యాములను నిర్మించామని తెలిపారు.చిరుత పులి తల్లితో కాకుండా ఒంటరిగా ఉండేందుకు కొత్త ప్రాంతమును ఏర్పాటు చేస్తుందని, దానిలో భాగంగా ఇక్కడ ఒకటిన్నర సంవత్సరాల వయసు గల చిరుత పులి సంచరించిందని సూచించారు.అటవీ ప్రాంతంలో మేకలు మేత మేసేందుకు వెళ్లే కాపరులు జాగ్రత్తగా ఉండాలని,అటవీ భూమిలోకి మేకలు గొడ్డలితో కాపర్లు వెళ్ళరాదని,మేకల కాపరులకు నోటీసులు ఇవ్వాలని సిబ్బందికి సూచించారు.చిరుత సంచారంతో జాడ కోసం ఈ ప్రాంతంలో రెండు కెమెరాలను ఏర్పాటుచేసి తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు.వన్యప్రాణుల గణన నవంబర్ చివరివారంలో 6 రోజులపాటు నిర్వహిస్తారని ఈ గణనలో వన్యప్రాణులకు సంబంధించిన పూర్తి సమాచారం తెలుస్తుంది ఆయన అన్నారు.చిరుత పులి సంచరిస్తుండంతో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కామారెడ్డి డివిజన్ పరిధిలో 50 వేల మొక్కలను అటవీ భూమిలో నాటామని,వచ్చే సంవత్సరానికి లక్ష మొక్కలను నాటేందుకు లక్ష్యంగా పెట్టుకొని నర్సరీలో మొక్కలను సిద్ధం చేస్తున్నామని అన్నారు. వారి వెంట డిఆర్ఓ రవికుమార్,బీట్ అధికారి నవీన్ ఉన్నారు.